ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
# రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 21 మే 2025



ఉష్ణోగ్రత
గరిష్ఠం 37.6
కనిష్ఠం 23.8



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మల్లేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య





రంగాపూర్ వద్ద లారీని ఢీకొట్టిన ఘటనలో నుజ్జునుజ్జయిన పెళ్లి బస్సు



# దారి కాచిన మృత్యువు!

- లారీని ఢీకొన్న పెళ్లి బస్సు
- నలుగురు దుర్మరణం, 31 మందికి గాయాలు
- సీతారాంపూర్, సోలిపేట్, రావులపల్లి, కిషన్‌నగర్‌లో విషాద ఛాయలు
- మృతులంతా వరుడి బంధువులే
- ఒక్కొక్కరిది ఒక్కోగాథ
- కదిలిస్తే కన్నీటి సాగరమే..





గాయాలైన వధువు మల్లీశ్వరిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న బంధువు

## హైదరాబాద్-బీజాపూర్ హైవేపై మృత్యుఘోష

పచ్చని పందిరి, మామిడి తోరణాలు, భాజాభజంత్రీల మోత, బంధువుల రాకపోకలు, పిల్లల ఆటపాటలతో నిన్న మొన్నటి వరకు సందడిగా ఉన్న ఆ ఇంట్లో పెనువిషాదం అలుముకుంది. అంగరంగ వైభవంగా పెళ్లి జరిగిందనే ఆనందం క్షణాల్లో ఆవిరై పోయింది. వివాహం తర్వాత బంధువులంతా కలిసి వధువు ఇంటికి వెళ్లి చేసిన విందు వారికి అదే చివరిదైంది. అప్పటివరకు ఒకరినొకరు ఆట పట్టించుకుంటూ సరదాగా గడిపిన వారు తిరిగి వరుడి ఇంటికి వస్తుండగా మృత్యువు కబళించింది. పెళ్లి బృందం వెళ్తున్న బస్సు రోడ్డుపై ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టడంతో నలుగురు మృత్యు ఒడిలోకి చేరారు. 31 మందికి పైగా గాయాలు కాగా, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ హృదయ విదారక సంఘటన వికారాబాద్ జిల్లా రంగాపూర్ సమీపంలో చోటుచేసుకుంది.

షాబాద్/షాద్‌నగర్/చేవెళ్ల/పరిగి, మే 20(ఆంధ్రజ్యోతి): వివాహ విందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వికారాబాద్ జిల్లా రంగాపూర్ సమీపంలో ఆగిఉన్న లారీని బస్సు అతివేగంతో ఢీకొట్టింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా, 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన వారంతా రంగారెడ్డి జిల్లా వాసులే. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. షాబాద్ మండలం చందన్‌వెల్లి గ్రామానికి చెందిన మంగలి రామస్వామి-మంజుల కుమారుడు సతీష్‌కుమార్ వివాహం పరిగికి చెందిన మల్లీశ్వరితో ఈనెల 16న వివాహం జరిగింది. సోమవారం వధువు

మిగతా 7వ పేజీలో...

### సందీప్ మృతితో దిక్కులేనివారైన తల్లి, భార్య



కన్నతల్లి కడుపున ఒకే ఒక్కడు పుట్టాడు. కట్టుకున్న ఇల్లాలికి తానే సర్వస్వం. గత నవంబర్‌లోనే వివాహం చేసుకున్నాడు. త్వరలో ఓ బిడ్డకు తండ్రి కానున్నాడు. ఇంతలోనే అనుకోని విషాదం ఆ కుటుంబాన్ని కుదిపేసింది. అమ్మను అనాథగా మార్చి, ఇల్లాలిని అగాధంలోకి నెట్టి మృత్యుఒడికి చేరాడు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ఫరూక్‌నగర్ మండలం కిషన్ నగర్ నివాసి సందీప్ మరణం వెనుక విషాదం ఇది. ఈ యువకుడు బ్యూటీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అంతేకాకుండా ప్రస్తుతం ఇతని భార్య మహేశ్వరి గర్భవతి. ఇలాంటి తరుణంలో సందీప్ మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పెంకుటింటిలో నివసిస్తూ రెక్కాడించి డొక్కలు నింపుకుంటున్న ఈ కుటుంబంలో చోటు చేసుకున్న ఈ విషాదం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తుంది.

### పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం

మల్లేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కు కోల్పోయింది మల్లేష్ నాగరగూడలో హెయిర్ కటింగ్‌షాప్‌ను నిర్వహిస్తున్నాడు. దాని పైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు అతనికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు మనస్వి(6), ఆద్య(2) కుమారుడు ప్రనీల్(4) ఉన్నారు. మల్లేష్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. భార్య, తల్లి ఆర్తనాదాలు మిన్నంటాయి. నాన్న కావాలి అంటూ పిల్లలు ఏడుపును చూసిన గ్రామస్తులు కంటతడి పెట్టారు.



### రోడ్లు రక్తసిక్తం

- జనవరి నుంచి ఇప్పటి వరకు 59 ప్రమాదాలు
- 33 మంది మృతి, 150మందికిపైగా క్షతగాత్రులు

హైవేపై పెట్రోలింగ్ ఎక్కడ?

7

## ప్రతిభావంతులకు చేయూతనిద్దాం

» సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులకు సరైన సమయంలో చేయూతనందించాల్సిన అవసరముందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జ్ఞానసరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని వినోభానగర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వారి అభిరుచి ఉండి ప్రతిభ ఉన్న అంశంలో ఎంపిక చేసి సెలవురోజుల్లో శిక్షణ ఇచ్చారు. మంగళవారం జరిగిన శిబిరం ముగింపు సమావేశానికి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్ఞానసరస్వతి సేవా నిరతిని కొనియాడారు. మాజీ ఎంఈవో శ్రీనివాస్, వాలీబాల్ క్రీడాకారుడు సుధాకర్‌రెడ్డి, ప్రమోద తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

## ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పిస్తాం

» డీఆర్‌డీవో పీడీ శ్రీలత

యాచారం, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు చేతి నిండా పని కల్పిస్తామని ఫాంపాండ్స్ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిస్తామని డీఆర్‌డీవో పీడీ శ్రీలత వెల్లడించారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలో ఆమె పాల్గొని మాట్లాడారు. కూలీలకు కేవలం నెల వేతనం మాత్రమే పెండింగ్‌లో ఉందని, వారం రోజుల్లో దానిని చెల్లించనున్నట్లు వివరించారు. మస్టర్లపై సంతకాలు లేకుండా కూలీలకు వేతనాలు చెల్లించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వనమహోత్సవంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ప్రత్యేకాధికారి మాధవరావు, ఏపీవో లింగయ్య, పంచాయతీరాజ్ ఏఈ వంశీ తదితరులున్నారు. కాగా, కూలీలకు పే స్లిప్‌లు, వేతనాలు ఇవ్వడం లేదని సీపీఎం నాయకులు ఆందోళనకు దిగారు. గంటన్నర పాటు సోషల్‌ఆడిట్‌కు అంతరాయం కలిగించారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

### పేలిన కారు బ్యాటరీ

» ఆరు కార్లు దగ్ధం

షాద్‌నగర్‌రూరల్, మే20(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ధన కార్ల షెడ్డులో మంగళవారం తెల్లవారు జామున మంటలు అంటుకుని ఆరు కార్లు దగ్ధమయ్యాయి. షెడ్డులో ఉన్న ఓ కారు బ్యాటరీ పేలడంతో మంటలు చెలరేగాయి. షెడ్డులో ఉన్న మిగతా ఐదు కార్లకు మంటలు అంటుకోవడంతో పూర్తిగా కాలి పోయాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని షెడ్డు నిర్వాహకులు తెలిపారు.

### రేపు ఉద్యోగ మేళా

రంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22(గురువారం)న నిర్వహించే ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అధికారి జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకామర్స్, బీపీవో రంగంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి.. 18-30 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందని, మల్లేపల్లి-శాంతినగర్‌లోని ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9063099306, 8977175394 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## చేవెళ్ల ఏఎంసీలో భగ్గుమన్న విభేదాలు!

### డైరెక్టర్లు, ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, కార్యదర్శి మధ్య లుకలుకలు

- పాలకవర్గంలో తారా స్థాయికి చేరుకున్న భేదాభిప్రాయాలు
- డైరెక్టర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చైర్మన్, వైస్‌చైర్మన్, కార్యదర్శి ఆరోపణ
- ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమంటున్న డైరెక్టర్లు
- పాలకవర్గాన్ని రద్దు చేయాలని డిమాండ్

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గంలో కొందరు డైరెక్టర్లు, చైర్మన్‌కు మధ్య విభేదాలు తలెత్తాయి. కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న ఈ వ్యవహారం మంగళవారం ఏఎంసీ చైర్మన్ ప్రెస్‌మీట్‌తో బహిర్గతమైంది. మెజారిటీ డైరెక్టర్ల అభిప్రాయాలు తీసుకోకుండా చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శి కుమ్మక్కై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని డైరెక్టర్లు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. సర్వసభ్య సమావేశానికి సమాచారం ఇవ్వడం లేదని, కొంత మంది డైరెక్టర్లతో తీర్మానం తీసుకొని పనులకు ఆమోదం తెలుపుతున్నారని ఆరోపిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ ఫీజు అతి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్

మిగతా 8వ పేజీలో...

### రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



- గుంతలమయంగా రాయపోల్- పోల్కంపల్లి గ్రామాల మధ్య లింక్ రోడ్డు
- ఇబ్బందుల్లో వాహనదారులు

వివరాలు 8వ పేజీలో...

### వైభవంగా నారసింహుడి కల్యాణం



8

### శంషాబాద్‌లో తిరంగా ర్యాలీ



శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో తిరంగా ర్యాలీని అట్టహాసంగా చేపట్టారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు. ప్రతీఒక్కరు జాతీయ జెండా చేతపట్టి సైనికులకు, దేశానికి అనుకూలంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండు, మహవీర్ బిల్డర్స్, కొత్వాల్‌గూడ చౌరస్తా, ఆర్బీనగర్, మధురానగర్, ఎయిర్‌పోర్టు చౌరస్తాల వరకు కొనసాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, డాక్టర్ ప్రేంరాజ్, తొకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శంషాబాద్, మే 20 ( ఆంధ్రజ్యోతి)

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

» రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మహేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఫుటేజీ కీలకంగా మారుతుందని రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలూరు రెవెన్యూ పరిధిలోని మ్యాక్ ప్రాజెక్టులో బీటీఆర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న మ్యాక్ ప్రాజెక్టులో నివాసాలు ఉంటున్న కుటుంబాలు భయపడాల్సిన అవసరం లేదని, పోలీసుల నిఘా కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు తోపాటు మ్యాక్ ప్రాజెక్టు డైరెక్టర్ అచ్చిరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు జేవీఎస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషానురాధ, కోశాధికారి రాఘవేందర్, సింహారెడ్డి, అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సుచరితారెడ్డి, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మద్‌నగర్ రెవెన్యూ పరిధి పోరెడ్డినికుంట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దెబ్బడగూడ మాజీ సర్పంచ్ డి.జంగయ్య మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మహ్మద్‌నగర్ రెవెన్యూలోని సర్వే నెంబర్ 45లో మట్టి తవ్వకాలను వెంటనే నిలిపి వేయాలని తహసీల్దార్ కె.గోపాల్‌ను కోరారు. ఆయన వెంట గ్రామస్తులు జి.జంగయ్య, జి.నర్సింహ, జి.శ్రీకాంత్, జి.సమ్మయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో ఆనంద్

## రోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

మర్పల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): రోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆనంద్ అన్నారు. ఆయన మంగళవారం మర్పల్లి ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకొని రోగులతో మాట్లాడారు. రోగులకు ఏవిధంగా వైద్య సేవలు అందుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, వైద్యుడు శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# 58.88 కిలోల గంజాయి పట్టివేత

● బీదర్‌కు చెందిన ముఠా గుట్టురట్టు ● ఐదుగురు నిందితుల రిమాండ్
● పరారీలో మరో ఇద్దరు ● గంజాయి, కారు స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న బీదర్ ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పెద్దమొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ధశరథ వివరాలను వెల్లడించారు. ఒడిశా నుంచి పుణేకు ఐదుగురి ముఠా గుట్టచప్పుడు కాకుండా గంజాయిని రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 9న వాహనాలు తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చి బ్రీజా కారు(కెఎ 39 ఎం 2162)ను ఆపి తనిఖీ చేశారు. అందులో 29బండిల్స్‌లో 58.88కిలోల ఎండు గంజాయి లభించింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా శంషేర్‌పూర్‌వాడికి చెందిన గోవింద్ తప్సలే, గజానంద్, పవన్, అకాష్, అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తారోత్ రాహుల్‌లుగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.23లక్షల 55వేల200 ఉంటుందని తెలిపారు. ఐదుగురు నిందితులు ఒడిశా రాష్ట్రం, గణపతి జిల్లాకు చెందిన సుమన్ జన్ని వద్ద కిలో గంజాయికి రూ.1900లకు కొనుగోలు చేసి పుణేకు చెందిన అభిషేక్‌కు కిలోగంజాయి రూ.5వేలకు విక్రయించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో వారు బ్రీజాకారులో భద్రాచలం, సూర్యాపేట పంతంగి టోల్‌గేట్ మీదుగా ఓఆర్‌ఆర్ నుంచి పుణే రోడ్డులో వెళ్లాలనుకున్నారు. సోమవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు ఓఆర్‌ఆర్ ఘట్‌కేసర్ ఎగ్జిట్ నెంబర్ 9 వద్ద బ్రీజా కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలినట్లు తెలిపారు. గంజాయితో పాటు కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఒడిస్సాకు చెందిన సుమన్ జన్ని పుణేకు చెందిన అభిషేక్‌లను త్వరలో పట్టుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ తెలిపారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి, ఎస్ఐలు సంగీతరెడ్డి, నందిని, సిబ్బందిని ఆయన అభినందించి వారికి రివార్డ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ తదితరులు


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు, కారు, గంజాయి ప్యాకెట్లు

## టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

చేవెళ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మేడం రామేశ్వర్‌రావు తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం టీడీపీ చేవెళ్ల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేయడం జరిగిందని గుర్తుచేశారు. టీడీపీ చేవెళ్ల మండలాధ్యక్షుడిగా లొంక రాములుగౌడ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దండు మాణిక్యం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అశోక్‌గౌడ్, వెంకటస్వామి, కృష్ణ, కార్యదర్శులుగా బాలరాజు, చందు, జంగయ్య, కోశాధికారిగా సాయిలు యాదవ్‌లు ఎంపికయ్యారు. శుభాన్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

**తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తేవాలి**

మంచాల : తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చక్రపాణి పిలుపునిచ్చారు. లింగంపల్లి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మంతు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా గడ్డం పుల్లారెడ్డి, దర్శన్, ప్రధాన కార్యదర్శిగా యార మదారి, కోషాధికారిగా బూరుగు శ్రీశైలం, సభ్యులుగా డి.భాగ్యమ్మ, కె.పద్మమ్మ, బత్తుల కొమురమ్మలు ఎన్నికయ్యారు. టీడీపీ మండలాధ్యక్షుడు యార మహేందర్, లక్ష్మణ్‌జీ, కొంగర వెంకట్‌రెడ్డి, వంగాల కృష్ణ, పగడాల ఆనంద్, పెర్క నర్సింహ, పొలమోని మల్లేష్ , మంగళారం రాములు, యాదయ్య, అవుతపురం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : నియామక పత్రాలను అందిస్తున్న రామేశ్వర్‌రావు


లింగంపల్లి కార్యవర్గాన్ని అభినందిస్తున్న సీహెచ్ చక్రపాణి

## హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడాలి

శంషాబాద్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు కలసికట్టుగా పోరాడి హక్కులను సాధించుకోవాలని రంగారెడ్డి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్‌లోని పద్మావతిగార్డెన్‌లో కమిటీ సభ్యులు దేవేందర్ అధ్యతక్షన సమావేశం నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకులు గణేశ్, సురేశ్‌కుమార్, చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈనెల 12న మృతి చెందిన ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌రావుకు నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులుగా దేవేందర్, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. షాద్‌నగర్ యూనియన్ నాయకులు నర్సింహారెడ్డి, జర్నలిస్టులు విక్రమ్‌కుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ కార్యవర్గం**

టీడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోపాల్, బుచ్చన్న, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, నర్సింహాయాదవ్, మాధవచారి, కోషాధికారిగా భానుమూర్తి, సహాయ కార్యదర్శులుగా సతీశ్‌బాబు, యాదగిరి, మద్దూర్ శ్రీనివాస్, సలహాదారులుగా కోళ్ల యాదయ్య, ప్రచార కార్యదర్శిగా జ్ఞానేశ్వర్‌ను ఎన్నుకున్నారు.


నూతన కమిటీ సభ్యులతో జిల్లా కమిటీ నాయకులు

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

షాద్‌నగర్‌రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్ కోరారు. బక్రీద్, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఏసీపీ కార్యాలయంలో శాంతిసమావేశం ఏర్పాటు చేశారు. ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రజలు శాంతియుతంగా మెలుగుతారని, మున్ముందు కూడా శాంతియుతంగా నడుచుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబర్‌ఖాన్, హాజరైన ఏసీపీ రంగస్వామి

## 25 లోపు ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి


ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా చేపట్టాలని ఈనెల 25వ తేదీ లోపు గ్రౌండింగ్ పూర్తి చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల స్పెషలాఫీసర్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి ఎంపీడీవోలను ఆదేశించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ఎంపీడీవో లు, ఇందిరమ్మ ఇళ్ల అధికారులతో సీఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్ గూర్చి ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాధురి, సుజాత, శ్రీకాంత్, వేజన్న, శంకర్‌నాయక్, సురేశ్, ఎంపీవో పాల్గొన్నారు.

## అకడమిక్ రీసెర్చ్‌లో మైలురాయిని దాటిన అనురాగ్

ఘట్‌కేసర్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు అకాడమిక్ రీసెర్చ్‌లో కీలకమైన మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు యూనివర్సిటీ సీఈవో నీలిమ తెలిపారు. అకడమిక్ రీసెర్చ్‌లో అనురాగ్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి, సీఎస్‌సీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వినయశ్రీలు ప్రతిష్టాత్మక ఎస్సీఐక్యూ1 జర్నల్‌లో అత్యాధునిక పరిశోధన వ్యాసాన్ని విజయవంతంగా ప్రచురించినట్లు ఆమె తెలిపారు. హెల్త్‌కేర్ బేస్డ్‌సైబర్, ఫిజికల్ సిస్టమ్స్‌లో విశ్వసనీయమైన, సురక్షితమైన అనుమతి పొందిన 'బ్లాక్‌చైన్ అసిస్టెడ్ డేటా ట్రాన్స్‌ఫర్ మెకానిజం'అనే శీర్షికతో రూపొందించిన ఈ పరిశోధనాపత్రం బ్లాక్‌చైన్, హెల్త్‌కేర్ వ్యవస్థలపై ముఖ్యభూమిక పోషిస్తుందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, ఆధారిత సైబర్ భౌతిక వ్యవస్థల డేటాబదిలీకి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అత్యుత్తమ పరిశోధనతో యూనివర్సిటీకి పేరు తీసుకొచ్చిన ప్రొఫెసర్లు మల్లికార్జున్‌రెడ్డి, వినయశ్రీలను సీఈవో నీలిమ అభినందించారు.

## కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం జాతర కొనసాగుతోంది. రెండో మంగళవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా వేపచీర ధరించి, జ్యోతిని మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జాతరలో ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవోశేఖర్‌గౌడ్‌తోపాటు మాజీ సర్పంచ్ బుడ్డెల్లి సాయిలు అక్కడి ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస్ పూజారి ఆలయ ప్రతినిధి రవి తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తాండూరు చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పోలీసులు సీసీకెమెరాల ద్వారా భక్తుల రాకపోకలను పరిశీలించారు.


కొలువుదీరిన అమ్మవారు, బోనాలతో భక్తులు

# దారి కాచిన మృత్యువు!

(ఐదో పేజీ తరువాయి)

ఇంటివద్ద పరిగిలో విందు నిర్వహించారు. ఈ వేడుకకు చందన్‌వెల్లి నుంచి ప్రైవేటు బస్సులో పరిగికి చేరుకున్నారు. సోమవారం రాత్రి 2గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. పరిగి మండలం రంగాపూర్ సమీపంలో ఆగి ఉన్న లారీని పెళ్లివారు ఉన్న టూరిస్టు బస్సు అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న నలుగురు దుర్మరణం చెందారు. 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇదే బస్సులో వధూవరులు ఉన్నప్పటికీ వారు క్షేమంగా ఉన్నారు. గాయపడిన వారిని పరిగి, వికారాబాద్, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. మృతి చెందిన వారిలో షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేష్ (35), సోలిపేట గ్రామానికి చెందిన మంగలి బాలమ్మ(60), చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన మంగలి హేమలత(32), ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన సందీప్(28) ఉన్నారు. మృతుల గ్రామాలైన సీతారాంపూర్, సోలిపేట్, రావులపల్లి, కిషన్ నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయా గ్రామాల్లో రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

### మరో ఇద్దరి మృతితో...

అలాగే షాబాద్ మండలం సోలిపేట గ్రామానికి చెందిన మంగలి బాలమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. బాలమ్మ (65) వరుడికి అమ్మమ్మ అవుతుంది. మృతురాలికి ముగ్గురు కుమారులు, కూతురు ఉంది. చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన హేమలత (32) రోడ్డు ప్రమాంలో దుర్మరణం చెందారు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. హేమలత కూతురు మంగలి మోక్షిత (6) తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉంది. మోక్షిత


పరిగి ఆస్పత్రి వద్ద గుమికూడిన జనం

మొయినాబాద్ మండల పరిధిలోని చాలెంజర్స్ స్కూల్‌లో ఫస్ట్ క్లాస్ చదువుతుంది.

### మృతుల కుటుంబాలకు అండగా ఉంటా : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

పరిగి, వికారాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. సీతారాంపూర్, సోలిపేట గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

### పెళ్లింట విషాదం....

షాబాద్ మండలం చందనవెల్లి గ్రామానికి చెందిన రామస్వామి, మంజుల దంపతుల కొడుకు సతీష్ కుమార్ పెళ్లి విందులో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదంలో మృతిచెందిన నలుగురు వరుడి దగ్గరి బంధువులే. మృతుల్లో ముత్యాల మల్లేశ్ వరుడికి సొంత బావ. హేమలత చిన్నమ్మ, బాలమ్మ అమ్మమ్మ, మంగలి సందీప్ మేనబావ అవుతారు. ఈ నలుగురు వేర్వేరు గ్రామానికి చెందినవారు.

### అమ్మ మృతి.. ఆస్పత్రిలో బిడ్డకు సీరియస్

రంగాపూర్ దగ్గర జరిగిన ప్రమాదంలో కన్నతల్లి మృతి చెందగా, బిడ్డ అస్పత్రిలో చికిత్స పొందుతున్నది. చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన మంగలి హేమలత, కుతూరు మోక్షిత పరిగిలోని విందుకు వచ్చారు. ఈ ప్రమాదంలో హేమలత అక్కడికక్కడే మృతి చెందింది. మోక్షిత తలకు తీవ్ర గాయాలు కావడంతో నిలోఫర్‌లో చికిత్స పొందుతుంది. మోక్షితకు తల్లి మృతి చెందిన విషయం తెలియదు. మోక్షిత పరిస్థితి కూడా విషమంగా ఉందని చెబుతున్నారు. దీంతో రావులపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది.

### ట్రావెలర్ నిర్లక్ష్య వైఖరి వల్లే ప్రమాదానికి కారణం?

ట్రావెలర్ నిర్లక్ష్య వైఖరి వల్లనే ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ ట్రావెలర్ నిర్వహిస్తుంటాడు. వరుడు స్వగ్రామమైన చందనవెల్లి నుంచి కుటుంబసభ్యులు, బంధువులు కలిసి ట్రావెలర్ బస్సును మాట్లాడుకొని 45 మందితో కలిసి పరిగిలో జరిగిన విందుకు తీసుకొచ్చారు. అయితే శ్రీకాంత్ ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సు కొందర్గులోని ఫంక్షన్‌కు వచ్చి రిపేర్ వచ్చింది. పరిగికి వచ్చిన బస్సును కొందర్గులోని సదరు ట్రావెల్ బస్సులోని వారిని నాగర్‌కుంటకు తీసుకెళ్లమని ట్రావెల్ యజమాని, పరిగికి వచ్చిన డ్రైవర్ ఎండీ యూసుఫ్ సూచించారు. దీంతో యూసుఫ్ ఇక్కడికి వచ్చిన వారికి నేను కొందర్గుకు వెళ్లి వస్తాను, అప్పటి వరకు వేచి ఉండాలని చెప్పిన కొందర్గుకు వెళ్లారు. కొందర్గులోని వారిని నాగర్‌కుంటకు తరలించిన తర్వాత అర్ధరాత్రి 1.30 గంటలకు ట్రావెల్ బస్సును పరిగికి తీసుకొచ్చాడు. పదిన్నర గంటలకు పరిగిలో విందు ముగించుకొని బస్సు కోసం వేచివేచి కొందరు నిద్రకు కూడా ఉపక్రమించారు. డ్రైవర్ ఒకటిన్నర ప్రాంతంలో అందరినీ లేపి ట్రావెల్స్ బస్సులో ఎక్కించుకుని చందనవెల్లి వెళ్లేందుకు బయలు దేరాడు. పరిగి నుంచి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న రంగాపూర్ దగ్గర రోడ్డు పక్కనే నిలిచి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 20మందికిపైగా గాయపడ్డారు. ట్రావెల్స్ బస్సును కొందుర్గుకు తీసుకెళ్లకుంటే ఈ ప్రమాదం జరిగేది కాదని బంధువులు ఆరోపించారు. కొందర్గుకు వెళ్లకుంటే పరిగిలో 11గంటలలోపే విందును ముగించుకుని తిరిగి రాత్రి 12లోపు స్వగ్రామానికి వెళ్లేవారమని చెబుతున్నారు. ట్రావెలర్ యజమాని వైఖరి వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు కూడా చెబుతున్నారు. బస్సు కొందర్గుకు వెళ్లకుంటే పరిగిలో విందును త్వరగా ముగించి సురక్షితంగా వెళ్లేవారమని గాయపడిన వారి బంధువులు తెలిపారు.

### పోలీసుల సేవలు భేష్

పరిగి మండలం రంగాపూర్ వద్ద మంగళవారం అర్ధరాత్రి, తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతులు, క్షతగాత్రులకు పోలీసులు అందించిన సేవలకు స్థానికులు అభినందనలు తెలిపారు. అర్ధరాత్రి ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల ఎస్ఐలు ఎం.సంతోష్, మధుసూదన్‌రెడ్డి, రమేశ్,ఆనంద్‌కుమార్‌లు,తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సులో ఇరుక్కుపోయినవారిని బయటకు తీశారు. వాహనం ఇనుప రాడ్ల మధ్య ఇరుకుపోయిన నలుగురి మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారు ఇరుక్కపోయి ఉండి కేకలు, రోదిస్తుండగా జేసీబీ ఇతర యంత్రాల సహాయంతో సురక్షితంగా బయటకు తీశారు. ఆరేళ్ల మోక్షిత ఇనుప చువ్వల కింద ఇరుక్కోవడంతో నిదానంగా బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంలో పోలీసుల సేవలను కొనియాడారు.

### రోడ్డు పక్కనే లారీని ఎందుకు ఆపారు.?

ట్రావెల్ బస్సు ప్రమాదానికి కారణమైన లారీ రోడ్డు పక్కనే ఎందుకు నిలిపి ఉంచారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పరిగి మండలం శల్మజాల తండాకు చెందిన లారీలో నిత్యం కర్ణాటకలోని సేడం నుంచి హైదరాబాద్‌కు సిమెంట్‌ను రవాణా చేస్తుంటారు. సోమవారం అర్ధరాత్రి కూడా సిమెంట్ బస్తాలను పరిగి మీదుగా నగరానికి వెళుతున్నది. లారీని రంగాపూర్ శివారులో రోడ్డు పక్కన ఎందుకు నిలిపి ఉంచారన్నది తెలియడం లేదు. ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ రోడ్డు పక్కనే నిలిపి ఉంచలేదని, లైవ్‌లో వెళుతున్న క్రమంలో వెనుకాల నుంచి ట్రావెల్ బస్సు ఢీకొట్టిందని మరికొందరు వాదిస్తున్నారు. లారీ రోడ్డుపై ఎందుకు ఆగి ఉండడాన్ని పోలీసులు తమ విచారణలో తేల్చాల్సి ఉంది.

### వధూవరులు క్షేమం

ప్రమాదంలో పెళ్లి జంట క్షేమంగా ఉన్నారు. నవ వధువు, వరుడు ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. వధువు మల్లేశ్వరి, వరుడు సంతోష్‌లు స్వల్ప గాయాలు కాగా, పరిగి ఆస్పత్రిలోనే ప్రాథమిక చికిత్సలు చేసుకుని వెళ్లిపోయారు. ట్రావెల్ బస్సులో పెళ్లి జంట ఇద్దరు ముందు భాగంలో కూర్చున్నారు. ప్రమాదం జరిగిన స్థలానికి కిలోమీటర్ దూరం ముందు మీరు వెనుకాలకు వెళ్లండని వారి పెద్దలు సూచించడంతో వారిద్దరూ వెనుకకు వెళ్లి కూర్చున్నారు. దీంతో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

# రోడ్లు రక్తసిక్తం

- అతివేగంతో గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 59 ప్రమాదాలు
- 33 మంది మృతి, 150మందికిపైగా క్షతగాత్రులు

పరిగి, మే 20 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం.. అస్తవ్యస్త రహదారులు.. ఆపై మద్యం సేవించి నడిపించడం.. వచ్చిరాని డ్రైవింగ్.. సామర్థ్యానికి మంచి ప్రయాణం మూలంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పరిగి సబ్ డివిజన్ పరిధిలో ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఈ రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నారు. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు అంగడిచిట్టెంపల్లి నుంచి రావులపల్లి వరకు జరిగిన 59 రోడ్డు ప్రమాదాల్లో 33 మంది మృతి చెందగా 150 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. మంగళవారం పరిగి మండలం రంగాపూర్ వద్ద లారీని పెళ్లి బస్సు ఢీకొట్టిన ఘటనలో నలుగురు మృతి చెందగా, 31 మందికిపైగా గాయాలైన ఘటన అందరినీ కలచివేస్తోంది.

### అడ్డగోలుగా పార్కింగ్‌లతో ప్రమాదాలు



రోడ్లకు ఇరువైపులా ఎక్కడబడితే అక్కడే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మన్నెగూడ చౌరస్తా, వికారాబాద్, పరిగి, హైదారాబాద్ రూట్లలో లారీలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. చీకటిపడగానే రోడ్లకు పక్కన ఆపుతున్నారు. పరిగి పట్టణంలో రోడ్ల పక్కన లారీలను నిలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మన్నెగూడ నుంచి కొడంగల్ వరకు మన్నెగూడ, రంగాపూర్-సోమన్‌గుర్తి, రూఫ్‌ఖాన్‌పేట్, చింతలచెరువు, తుంకిమెట్ల, రావులపల్లి, పరిగి - షాద్‌నగర్ రహదారిలో రంగాలక్ష్మీదేవిపల్లి గేట్ దగ్గర ఉన్న సుగుణ స్టీల్ ఫ్యాక్టర్ దగ్గర భారీ వాహనాలు నిలుపడంతో వాహనదారులకు ఇబ్బందికంగా మారింది. ఈ రూట్‌లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుర్తించి రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

### హైవేపై పెట్రోలింగ్ ఎక్కడ?

**ఆందోళన కల్గిస్తున్న రోడ్డు ప్రమాదాలు**



హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై పోలీస్ పెట్రోలింగ్ 24 గంటలపాటు నిర్వహించడం లేదు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై రెండు పెట్రోలింగ్ స్టేషన్‌లు ఉన్నప్పటికీ అంతంతమాత్రమే పెట్రోలింగ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం అంగడిచిట్టెంపల్లి నుంచి కొడంగల్ మండలం రావులపల్లి వరకు జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై మన్నెగూడ, కొడంగల్‌లలో హైవే పెట్రోలింగ్ స్టేషన్లను ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన సమయంలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించారు. ఆ తర్వాత ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బందికి కుదించారు. ఒక్కోసారి ఇద్దరే విధులు నిర్వహిస్తుంటారు. సిబ్బంది అరకొరగా ఉంటే నిరంతర నిఘా, పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుందని పోలీస్ ఉద్యోగులే అంటున్నారు. మన్నెగూడ పెట్రోలింగ్ స్టేషన్ అంగడిచిట్టెంపల్లి నుంచి గడిసింగాపూర్ వరకు, కొడంగల్ స్టేషన్ గడిసింగాపూర్ నుంచి రావులపల్లి వరకు పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే రాత్రిపూట అసలే పెట్రోలింగ్ నిర్వహించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా నిర్వహించి పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత, అక్రమ రవాణా వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులపై త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గుట్కా, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టామని, పీడీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రకు ప్రత్యేక బలగాలను మోహరించి, షీటీమ్స్ పనితీరును మరింత మెరుగు పర్చాలన్నారు. బక్రీద్ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ టీవీ హన్మంత్ రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

తలకొండపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. దేశభక్తి గీతాలకు విద్యార్థులు వివిధ వేషధారణతో చేసిన నృత్యాలు అమితంగా ఆకట్టుకున్నాయి. శృతిలయకల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్మ మాధవ రెడ్డి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శృతిలయ కల్చర్ అకాడయీ చైర్మన్ చిత్తరంజన్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, బోనాల, దేవతామూర్తుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాము, నర్సింహ, విజయ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

# సీఎస్ఆర్ నిధులతో బీసీ రెసిడెన్షియల్ ఏర్పాటు

**ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**


ఆమనగల్లులో పాత బీసీ వసతి గృహ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, మే20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో సీఎస్ఆర్ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయిస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. ఆమనగల్లులోని మాడ్గుల రోడ్డులో వసతిగృహం ఎత్తివేయడంతో నిరుపయోగంగా శిథిలావస్థకు చేరుకున్న బీసీ బాలుర వసతి గృహ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురామ్, తహసీల్దార్ లలితలతో కలిసి ఎంపీ పరిశీలించారు. పిల్లలు లేరన్న సాకుతో వసతి గృహాన్ని ఎత్తివేసి భవనాన్ని వృథాగా వదిలివేయడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనం చుట్టూ ఉన్న చెత్త చెదారాన్ని తొలగించాలని అధికారులకు ఆదేశించారు. వసతి గృహం స్థానంలో సీఎస్ఆర్ నిధుల ద్వారా బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూల్ ప్రభుత్వ పరంగా మంజూరు చేయించి సీఎస్ఆర్ నిధులు రూ.5 కోట్లతో అధునాతన భవనాలు నిర్మిస్తామని చెప్పారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన భూ వివాదాన్ని పరిష్కరించి అసంపూర్తి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని మల్లు రవి తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, పీసీసీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు బాబా, నాయకులు శ్రీను నాయక్, మహేశ్ పాల్గొన్నారు

# రైతులకు అందిస్తున్న సేవలు భేష్

- ఇండోనేషియా వ్యవసాయ శాఖ అధికారుల కితాబు


చేగూర్ పీఏసీఎస్ వద్ద ఇండోనేషియా వ్యవసాయశాఖ అధికారులు

నందిగామ, మే 20(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలపరిధిలోని చేగూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఇండోనేషియా వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. వ్యవసాయ రంగంలో ఎరువులు, విత్తనాల సరఫరా విధానంపై వారు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, రికార్డుల నిర్వహణ, ఆధార్ ఆధారిత పంపిణీ విధానంపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎరువుల సరఫరా విధానంలో పారదర్శకత, సమర్థత కోసం 60 శాతం పీఏసీఎస్‌ల ద్వారా, 40 శాతం ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వారికి వివరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ నిర్వహణను అభినందిస్తూ.. రైతులకు అందిస్తున్న సేవలు ప్రేరణాత్మకంగా ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ఇండోనేషియా అభివృద్ధి ప్రణాళిక మంత్రిత్వశాఖ ప్రధానాధికారి బాపక్ లియోనార్డో, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహ్మారావు, ఏడీ నిషాంత్‌కుమార్ అధికారులు మాధవి, సత్యంబాబు, రాంశివరావు, కవిత, రవి, తేజ్‌కుమార్, వెంకటయ్య, ఇండోనేషియా అధికారుల బృందం పాల్గొన్నారు.

### శంషాబాద్‌లో ఫర్టిలైజర్ షాపుల సందర్శన

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఇండోనేషియా బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా తెలంగాణలో రైతులకు విత్తనాలు ఎలా సరఫరా అవుతున్నాయనే విషయాన్ని తెలుసుకున్నారు.

# రూ.594 కోట్లతో రోడ్ల అభివృద్ధి

- పీఆర్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి


కాంట్రాక్టర్లు, అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధి పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లకు పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి మంజూరైన రూ.594 కోట్లతో రోడ్డు పనులకు సంబంధించి మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో ఈఈ సత్యనారాయణరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నా పనుల్లో జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించారు. కడా పరిధిలో మంజూరైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీడీఆర్ నిధులతో 18 అభివృద్ధి పనులకు రూ.కోటీ 30 లక్షలు, ఎస్‌డీఎఫ్ కింద 112 పనులకు రూ.434 కోట్లు మంజూరు కాగా, కడా కింద 870 పనులకు రూ.30 కోట్లతో పనులు సాగుతున్నట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో డీఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ‘ధరణి’తో దగాపడ్డాం.. న్యాయం చేయండి

**రెవెన్యూ సదస్సులో అధికారులను వేడుకున్న దళిత రైతులు**


రెవెన్యూ సదస్సులో భూ సమస్యను అధికారులకు వివరిస్తున్న దళిత రైతు చంద్రయ్య

ధారూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ‘ధరణి’తో పాసుపుస్తకాలు రాక దగాపడ్డామని, భూ భారతిలోనైనా తమకు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని రెవెన్యూ సదస్సులో దళిత రైతులు అధికారులను వేడుకున్నారు. ధారూరు జిల్లాపరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ధారూరులోని సర్వేనంబరు 104లో ప్రభుత్వం ఇచ్చిన భూములకు సంబంధించిన సమస్యను రైతులు సదస్సులో అధికారులకు వివరించారు. ఈ భూముల విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని ధరణిలో తమకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదని వారు చెప్పారు. ఈ సర్వే నంబరులో 18మంది దళితులకు 15.20గుంటల భూమి ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. ఈ భూమిలో పూర్వకాలం నుంచి కబ్జాలో తక్కువ ఉన్నా ఎక్కువ, ఎక్కువ కబ్జాలో ఉన్నా తక్కువ కబ్జాలో ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారని చంద్రయ్య అనే రైతు వివరించారు. దీని కారణంగా ధరణిలో కొత్త పాసుపుస్తకాలు రాలేదని ఆయన చెప్పారు. దీని కారణంగా తమకు రైతు భరోసా, పీఎం కిసాన్ డబ్బులు రాక, బ్యాంకుల్లో రుణాలు ఇవ్వక రైతు రుణమాఫీ కోల్పోయామని వాపోయాడు. అదేవిధంగా మృతిచెందిన రైతులకు రైతు బీమా అందలేదని, వారి వారసులకు విరాసత్‌లు కాలేదని ఆయన అధికారులకు వివరించారు. తాము సాగులో ఉన్న భూమికైనా లేనిపక్షంలో సర్వే నిర్వహించి ఎవరెవరు ఎంతసాగులో ఉంటే అంత భూమికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ దళిత రైతులు దరఖాస్తు అందజేశారు. కాగా ఈసమస్యను ప్రత్యేకంగా పరిశీలించి సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ సాజిదాబేగం వారికి హామీ ఇచ్చారు. కాగా వ్యవసాయ భూముల్లో ఇళ్లులేకున్నా ధరణిలో నేచర్‌ఆఫ్ ల్యాండ్ కాలమ్‌లో హౌజెస్(ఇళ్లు) అని పొరపాటుగా నమోదు చేయటంతో చాలాకాలంగా మ్యుటేషన్లు ఆగిపోయాయని, పాసుపుస్తకాలు రాలేదని సమస్యనుపరిష్కరించాలని రైతులు కోరారు.

# రైతులకు అన్యాయం జరగనివ్వం

- రావిర్యాలలో నిర్వహించిన గ్రామ సభలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

మహేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల కొంగర ఖుర్దు(ఎ)లో భూములు కోల్పోతున్న ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వమని, ప్రజలు, రైతుల అభిప్రాయం మేరకే అధికారులు విధులు నిర్వహిస్తారని, పరిహారం విషయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వ నిర్ణయం మేరకు అందిస్తామని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. కొంగర ఖుర్దు(ఎ) లోని సర్వే నెంబర్ 289లో గల 277ఎకరాల అసైన్డ్ భూముల్లో ఎలక్ట్రానిక్ పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన చేయడంతో భూ సేకరణ పరిహారం, పునరావాస, ఉపాధి కల్పనకు సంబంధించి తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల వార్డు కార్యాలయంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తుండగా కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 140 మంది రైతులకు సంబంధించి 277 ఎకరాల ఎకరాల భూమిని కోల్పోతున్నామని.. ఈ భూములను తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వ తీసుకుంటే మా గతేంటని పలువురు రైతులు అధికారులను ప్రశ్నించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రతీ రైతుకు వెయ్యి గజాల స్థలంతో పాటు పరిహారం కూడా అందజేయాలని, మార్కెట్ ధర చెల్లించాలని, లేనిపక్షంలో భూములను ఇవ్వబోమని అధికారులకు తేల్చి చెప్పడంతో పాటు లిఖిత పూర్వక దరఖాస్తులు అందజేశారు. దాంతో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులుగా మీరు డిమాండ్ చేయడం సబబే అయినప్పటికీ.. మీ ప్రతిపాదనలను అధికారులుగా మేము నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి ప్రతీ రైతుకూ న్యాయం జరిగేలా చేస్తామన్నారు. అదేవిధంగా జీవనోపాధి కోల్పోయిన వారికి ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పునరావాసం కల్పించి ఉపాధి కూడా చూపుతుందన్నారు. మార్కెట్ ధరకు మూడు రెట్లు పరిహారం ఇచ్చి రైతులను అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని భూ సర్వేకు సహకరించాలని ఆర్డీవో కోరారు. మహేశ్వరం తహసీల్దార్ సైదులు, రావిర్యాల రైతులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఏఎంసీలో భగ్గుమన్న విభేదాలు!



మాట్లాడుతున్న డైరెక్టర్లు

(ఐదో పేజీ తరువాయి)

తక్కువగా తీసుకుంటున్నారని, తక్ పట్టీలు వేయడం లేదని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో వ్యాపారస్తుడు రూ.40 వేల మాల్ అమ్మితే అతని వద్ద కేవలం 30 రూపాయలే ఫీజు తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కమిషన్ ఏజెంట్ల నుంచి లైసెన్స్ రిన్యూవల్ కోసం అదనంగా ఒక్కో కమీషన్ ఏజెంట్ వద్ద ఆరువేల రూపాయలు వసూలు చేస్తున్నారని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు సవాల్ చేస్తూ ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కార్యదర్శి మహేందర్ మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్‌తో డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శి మధ్య లుకలుకలు కనిపించాయి. పాలకవర్గంలో భేదాభిప్రాయాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకునే స్థాయికి చేరుకున్నాయి. కొంత మంది డైరెక్టర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శి ఆరోపించారు. ప్రతి నెలా కొంత అమౌంట్ ముట్టచెప్పాల్సిందిగా బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. డైరెక్టర్ల విహార యాత్ర విషయంలో ప్రభుత్వం తరపున రూ.98 వేలు కేటాయిస్తే.. సొంతంగా మరో రూ.60 వేలు తాను ఖర్చు పెట్టడం జరిగిందని చైర్మన్ తెలిపారు. డైరెక్టర్లు ఓర్వలేకనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తాను పేదవాడినని, డబ్బులు లేనోడు రాజకీయం చేయొద్దా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో డబ్బులే శాశ్వతమనుకుంటే ఎకరం అమ్మి డబ్బులు ఆశిస్తున్న డైరెక్టర్లకు తలా కొన్ని ఇస్తానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. తాము డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని, లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని డైరెక్టర్లు మల్లేష్, జనార్దన్, సత్యనారాయణ, పడాల రాములు, నరేందర్ హెచ్చరించారు. డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు చేసిన పాలకవర్గంలో మేం ఉండబోమన్నారు. పాలకవర్గాన్ని వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. దాంతో చేవెళ్ల ఏఎంసీ రాజకీయ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

## క్రైం కార్నర్

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

శంషాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈకో పార్కు వాకింగ్‌ట్రాక్‌పై ఓ వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు చేసిన ప్రాథమిక దర్యాప్తులో ఆ వ్యక్తి రాజేంద్రనగర్‌కు చెందిన బోడాసు రాజు (29)గా తెలిసింది. అతని కుటుంబీకులను విచారించగా సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, అతను తాగుడుకు బానిసయ్యాడని.. మద్యం మత్తులో మృతిచెంది ఉండొచ్చని కుటుంబీకులు భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించినట్లు చెప్పారు.

హుక్కా తాగుతూ

### పోలీసులకు పట్టుబడిన యువకులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న హుక్కా సామగ్రి

శంషాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గండిగూడలో గల ఓ ఫాంహౌజ్‌లో మంగళవారం సాయంత్రం హుక్కా తాగుతూ డీజే పాటలతో ఎంజాయ్ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 12 మంది యువకులను అరెస్టు చేసినట్టు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ మండలం గండిగూడ గ్రామంలోని ఎంఆర్‌జీ ఫాంహౌస్‌లో కొంతమంది యువకులు హుక్కాతాగుతూ డీజే పాటలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు శంషాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం అందింది. వారు ఫాంహౌస్‌కు వెళ్లి తనిఖీ చేయగా నగరానికి చెందిన 12 మంది యువకులు కనిపించారు. వారు హుక్కాతాగుతూ డీజే పాటలు వింటూ స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు గమనించారు. దాంతో వారిని అరెస్టు చేసి హుక్కా తాగడానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు!

చౌదరిగూడ, మే 20(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. గుర్రంపల్లి గ్రామానికి చెందిన లింగని లక్ష్మయ్య(45) గ్రామ శివారులోని చెరువులో మంగళవారం సాయంత్రం చేపలు పట్టడానికి భార్య లక్ష్మమ్మకు చెప్పి వెళ్లాడు. రాత్రి కావస్తున్నా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్సై విజయ్ తెలిపారు. కాగా, చెరువులో గల్లంతైనట్లు ఆయన చెప్పారు.

## ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలు

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

కొత్తూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తీగాపూర్ రోడ్డులో గల ఓ పరిశ్రమకు విద్యుత్ సరఫరా కోసం నూతనంగా వేస్తున్న విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం స్తంభాలను ఇష్టారాజ్యంగా వేస్తున్నారని మండల పరిధిలోని తీగాపూర్ గ్రామస్తులు కలెక్టర్‌తో పాటు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పారిశ్రామికవాడలో రవి ఫుడ్స్ పరిశ్రమకు స్థానిక సబ్‌స్టేషన్ నుంచి నూతనంగా 33/11కేవీ విద్యుత్ లైన్ వేస్తున్నారని పేర్కొన్నారు. స్తంభాలు సీసీ రోడ్డుకు ఆనుకొని వేస్తున్నారని, విద్యుత్ లైన్లు రోడ్డు మీదకు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పారిశ్రామికవాడ, భారీ గోదాంలు, కన్హా శాంతివనంతో పాటు, చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాలకు భారీ ఎత్తున వాహనాలు వచ్చి వెళ్తుంటాయని పేర్కొన్నారు. ఓ వైపు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్ ఉండగా, మరో పక్క నూతన లైన్ ఏర్పాటు చేస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇట్టి విషయాన్ని విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయిన ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు దూరంలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.

### చికిత్సకు స్నేహితుల చేయూత

ఆమనగనల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న స్నేహితుడికి బాల్య మిత్రులు చేయూతనందించారు. అధైర్యపడొద్దని, తాము ఉన్నామని మనోధైర్యం కల్పించారు. ఆమనగల్లు మండలంలోని చింతలపల్లికి చెందిన లక్ష్మారెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు చింతలపల్లి గ్రామంలో లక్ష్మారెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య చికిత్సల కోసం ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, బాల్య మిత్రుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూ.20వేలు అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంగలి రఘు, కోట రాములు, నిరంజన్, రాములు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

● వాహనదారుల ఇబ్బందులు



గుంతలమయంగా రాయపోల్-పోల్కంపల్లి రోడ్డు

ఆదిభట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతలు, కంకర తేలిన అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని రాయపోల్-పోల్కంపల్లి గ్రామాల మధ్యన లింక్ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగుకో గుంత ఏర్పడి ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. పోల్కంపల్లి-రాయపోల్‌కు రెండు కిలోమీటర్ల రోడ్డే అయినా.. ప్రయాణం సాఫీగా సాగని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన ప్రజలు పోల్కంపల్లి-రాయపోల్ మీదుగా విజయవాడ హైవేకు వెళ్లాలంటే ఈ రోడ్డు ఉపమోగకరంగా ఉంటుంది. కానీ, అడుగుకో గుంత ఏర్పడంతో రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. గుంతలు, కంకర తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును బాగు చేయాలని పాలకులకు, అధికారులకు స్థానిక ప్రజలు అనేక మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు రాత్రివేళల్లో కిందపడి గాయాలైన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుపుతున్నారు. పోల్కంపల్లి-రాయపోల్‌కి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాయపోల్, లింగపల్లి, మంచాల గ్రామాల కు చెందిన ప్రజలు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా ఈ రో డ్డు మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. కంకర, గుంతలు ఏర్పడిన రోడ్డుతో కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు నిధులు కేటాయించి రోడ్డు బాగు చేయాలని పోల్కంపల్లి-రాయపోల్ ప్రజలు కోరుతున్నారు.

# వైభవంగా నారసింహుడి కల్యాణం

● పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
● భక్తిశ్రద్ధలతో హోమాలు, అభిషేకాలు



భక్తులకు తాలిబొట్టు చూపిస్తున్న అర్చకులు

తలకొండపల్లి, మే20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో బాగంగా నిర్వహించిన స్వామి కల్యాణోత్సవం నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలు రంగు,రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. తలకొండపల్లి తో పాటు సమీప గ్రామాల నుంచి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ నిర్వాహకుడు, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌మంజుల దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఉదయం ఆంజనేయ స్వామి అభిషేకం, మహాసుదర్శన హోమం, మహా మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి కార్యక్రమా లు నిర్వహించారు. అతిథులను ఉప్పల వెంకటేశ్ ఆలయ మర్యాదలతో సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూ జలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భం గా వెంకటేశ్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నా య కులు జ్యోతయ్య, గోపాల్ నాయక్, బుచ్చిబా బు, శంకర్, విజయ్‌రెడ్డి, నరోత్తమ్ రెడ్డి, బాలకుమార్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, రఘుపతినాయక్, అనిల్, జగతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక దిగుబడి



చేవెళ్ల : మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజయ్య



యాచారం : మాట్లాడుతున్న వీసీ జానయ్య

యాచారం, మే 20(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని, పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ జానయ్య రైతులకు సూచించారు. మంగళవారం యాచారం మండలం మాల్ రైతు వేదికలో పంటల సాగు, విత్తనాల ఎంపిక అంశంపై రైతులకు సూచనలు సలహాలు చేశారు. విత్తనాల కోసం దుకాణాలపై ఆధారపడకుండా ఇంట్లోనే నాణ్యమైనవి తయారు చేసుకోవడంతో పాటు ఇతరులకు విక్రయించి ఆర్థిక ఇబ్బందులు తీర్చుకోవాలన్నారు. చీడపీడల నివారణకు తోచిన మందులు వాడి నేలను గుల్లబారకుండా చూసుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించడంపై చొరవ తీసుకోవాలన్నారు. రసాయన మందులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. జీవ నియంత్రణ శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణబాబు, డాక్టర్ సునిత, సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం డివిజనల్ వ్యవసాయాధికారి సుజాతరెడ్డి, యాచారం ఏవో రవినాథ్, మాల్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే యంత్ర పరికరాలను ఉపయోగించి మహిళలు వ్యవసాయంలో శ్రమను తగ్గించుకోవాలని వ్యవసాయ యంత్రాల పరీక్షణ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లక్ష్మణ్‌లు తెలిపారు. చేవెళ్ల మండలం కుమ్మెర గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (రాజేంద్రనగర్) ఆధ్వర్యంలో మంగళవారం మహిళా రైతులకు యంత్రాలు, పనిముట్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ టెక్నీషియన్లు భాస్కర్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



చేవెళ్ల : మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం తగదని, కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి అన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, సీపీఐ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, రైతు సంఘం నాయకుడు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు శివ, సీఐటీయూ శంకర్‌పల్లి మండల కన్వీనర్ మల్లేషం, షాబాద్ మండల కన్వీనర్ నరసింహ పాల్గొన్నారు.

**శంషాబాద్ రూరల్ :** జూన్ 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల నాయకులు సామ్యేల్, యువజన సంఘం మండలాధ్యక్షుడు ఏపూరి పవన్ కుమార్, మున్సిపాలిటీ కార్మికుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జయేందర్, నాగేశ్, నర్సింగ్ రావు, సత్తయ్య, గోపాల్, యాదమ్మ, ఇందిర, సుజాత, సునీత తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్ రావు ఆరోపించారు. పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు. జెండాలు చేబూని హైదరాబాద్-శ్రీశైలం హైవేపై ర్యాలీ నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు జహంగీర్, యాదయ్య, కృష్ణయ్య, జంగయ్య, అశోక్, బాల్‌రామ్, శ్రీను, జంగయ్య, జీపీ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులున్నారు.



ఆమనగల్లు : ర్యాలీలో సీఐటీయూ నాయకులు

**యాచారం :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధి కూలీలతో కలిసి నిరసన వెలిబుచ్చారు. సీఐటీయూ నాయకుడు పి.బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాయడం దారుణమన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ చందూనాయక్, నాయకులు యాదమ్మ, యశోద, రాములు, సాలయ్య, వినోద తదితరులు పాల్గొన్నారు.



యాచారం : నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

షాద్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో కుట్టులో శిక్షణ పొందిన 30మంది మహిళలకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. బాబర్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు తగిన ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఫెమినా నిర్వాహకురాలు ఆలియా సుల్తానాబేగం, నాయకులు రఘునాయక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణీలకు మెడికల్ కిట్ల పంపిణీ

తలకొండపల్లి/మాడ్గుల, మే 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్‌లో మంగళవారం గర్భిణీలకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కిట్లను సమకూర్చారు. ఆశా కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు వాటిని పంపిణీ చేశారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కిట్లను సమకూర్చిన వెంకటేశ్‌ను నాయకులు అభినందించారు. నాయకులు శ్రీశైలం, జంగయ్య, దాసు, విజయ్‌కుమార్, చందు, శ్రీను, గణేశ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాడ్గుల మండలం పాత బ్రాహ్మణపల్లిలో ఉప్పల వెంకటేష్ అనుచరులు తిరుపతయ్య మెడికల్ కిట్లు అందచేశారు. శ్రీను, గ్యార సురేష్, సాలయ్య, ఏఎన్ఎం శాంతమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాడ్గుల : మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఆశాలు, నాయకులు

## అద్దె చెల్లించండి మహాప్రభో..

● ఆత్మహత్యే శరణ్యం : బీజేపీ ఆఫీసు ఇంటి యజమాని

షాద్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయం అద్దె చెల్లించాలని, లేకుంటే తన కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని ఇంటి యజమాని రామాంజనేయులు వేడుకుంటున్నాడు. గత మూడు సంవత్సరాల అద్దె రూ.8.50లక్షలు చెల్లించాల్సి ఉందని, కానీ ఆ పార్టీ నేతలు ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసిన వీడియోలో మాట్లాడుతూ 2022 నుంచి 2025వరకు రూ.10లక్షలు అద్దె చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి రూ.లక్ష చెల్లించగా అందె బాబయ్య మరో రూ.50వేలు చెల్లించారని తెలిపారు. మిగతా అద్దె డబ్బులు అడిగితే ఎవరూ స్పందించడం లేదన్నారు. షాద్‌నగర్ బీజేపీలోని అంతర్గత విబేధాలతో తమను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయవద్దని వేడుకున్నాడు. అద్దె చెల్లించకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమన్నారు.

**అద్దె రూ.11వేలు మాత్రమే : అందె బాబయ్య**

బీజేపీ కార్యాలయం అద్దె రూ.11వేలు మాత్రమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య తెలిపారు. అంత పెద్దమొత్తంలో అద్దె బకాయిలు లేవని, గతంలో తాను 1.20 లక్షలు, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మరో రూ.లక్ష చెల్లించారని వెల్లడించారు. గతేడాదే ఇంటిని ఇతరులకు అద్దెకు ఇవ్వమని యజమానికి తెలిపామని, బకాయి ఉన్న అద్దెను త్వరలోనే చెల్లిస్తామని, యజమాని అవస్థవాలు చెప్పరాదని హితవు పలికారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

కేశంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళగూడకు చెందిన పోరండ్ల బాలమణి ఆదివారం బైక్‌పై నుంచి పడి మృతిచెందింది. ఈమేరకు మృతురాలు బాలమణి కుటుంబ సభ్యులకు కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి రూ.5 వేలు, కాంగ్రెస్ నాయకుడు కొట్లం నరేందర్‌రెడ్డి రూ.2వేల ఆర్థిక సాయం అందించి పరామర్శించారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

## కులవృత్తుల అభ్యున్నతికి కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, మే 20(ఆంధ్రజ్యోతి): కులవృత్తుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండల కేంద్రానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థానికంగా తమకు స్థలం కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జంగయ్యయాదవ్, కావలి శ్రీనివాస్, జెనిగె వెంకటేష్ యాదవ్, ఏర్పుల రాజు, వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరకొండ రమేష్, ఎన్నిదుల సురేష్, బాషయ్య, ముత్యాల వెంకటేష్, దేవరకొండ సత్యనారాయణ, అశ్వాల జంగయ్య, జగన్, శ్రీను, నరేందర్ రెడ్డి, వెంకటేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం

షాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వరమే స్పందిస్తామని, మండలంలో ఏమైనా సమస్యలుంటే వినియోగదారులు ఈ కింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఏఈ కోటేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. గతంలో బీఎస్ఎన్ఎల్ ఫోన్ నెంబర్లు ఉండేదని, పస్తుతం ఎయిర్‌టెల్ నెంబర్లు వచ్చాయని పేర్కొన్నారు. వినియోగదారులు సంప్రదించవలసిన నెంబర్లు.. ఏఈ కోటేశ్వర్‌రావు 8712469546, శివకుమార్(లైన్‌మ్యాన్) షాబాద్ 8712469570, షాబాద్ సబ్‌స్టేషన్ 8712469608, అంతారం సబ్‌స్టేషన్ 8712469609, బొబ్బిలిగామ సబ్‌స్టేషన్ 8712469602, తాళ్లపల్లి సబ్‌స్టేషన్ 8712469603, చందన్‌వెల్లి సబ్‌స్టేషన్ 8712469604, హైతాబాద్ సబ్‌స్టేషన్ 8712469610 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

### ఉత్సాహంగా 'తిరంగా యాత్ర'



జాతీయ జెండాతో మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ నాయకులు

చేవెళ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచదేశాలకు భారత్ శక్తి ఏమిటో తెలిసిందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రం నుంచి మంగళవారం శంషాబాద్‌కు పెద్దఎత్తున తిరంగా యాత్రకు బయలుదేరారు. ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంతో దేశం ఎంతో బలోపేతమైందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పామన్నారు. పాకిస్థాన్ ఇప్పటికైనా టెర్రరిజాన్ని మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ మండలాధ్యక్షుడు అత్తిలి అనంత్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

● ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు సురేష్‌గుప్తా



సభ్యత్వ నమోదు పత్రాలను అందిస్తున్న సురేష్‌గుప్తా

షాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేష్‌గుప్తా అన్నారు. మంగళవారం షాబాద్‌లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం లేని వారు నూతనంగా నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా వృద్ధాప్య భృతి కొరకు 65 సవంత్సరాల పైబడిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్యవైశ్యులకు అండగా సంఘం ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దండు రాహుల్ గుప్తా, ట్రెజరర్ నీల రవీందర్‌గుప్తా, జిల్లా కార్యదర్శి చొక్కంపేట రాకేష్‌గుప్తా, షాబాద్, ఫరూఖ్‌నగర్ మండలాల అధ్యక్షులు పాపిశెట్టి సాయిరామ్‌గుప్తా, నారాయణ, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ మలిపెద్ది శ్రీనివాసులు, ఫరూఖ్‌నగర్ మండల మాజీ అధ్యక్షుడు మురళి, సభ్యు లు గడ్డం రమేష్‌గుప్తా, ఉప్పు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కడ్తాల్, మే20(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను సాకారం చేస్తుందని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు చల్ల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్, చల్లంపల్లి మాజీ సర్పంచ్ నాయిని నరేందర్‌లు అన్నారు. చల్లంపల్లి, వంపుగూడ గ్రామాలలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు ప్రొసీడింగ్‌లను కార్యదర్శి సందీప్ ఆధ్వర్యంలో అందజేశారు. రమేశ్ గౌడ్, రమేశ్, మహేశ్, కృష్ణయ్య, జంగయ్య, సుధాకర్ ఉన్నారు.

### లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య

కేశంపేట, మే 20(ఆంధ్ర జ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య సూచించారు. చౌలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ఇంటి నిర్మాణం చేపడితే బిల్లులు వెంటనే వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, మాజీ సర్పంచ్ గూడ వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



మంచాల : అడ్మిషన్లు ఇప్పిస్తున్న సభ్యులు

కేశంపేట/మంచాల, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కేశంపేట మండల ఇన్‌చార్జి విద్యాధికారి చంద్రశేఖర్ సూచించారు. కేశంపేట మండలం కొత్తపేట పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరం నిర్వహించారు. సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించబ డుతున్నాయని మంచాల మండలం ఆరుట్ల జెడ్పీహైస్కూల్ విద్యాకమిటీ సభ్యుడు నూకంరాజు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశాడు. ఎస్ఎంసీ సభ్యులతో కలిసి పలువురు విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. రోజుకు 30కి పైగా నూతన అడ్మిషన్లు వస్తున్నాయన్నారు. జానీపాష, లాలగారి జంగయ్య, టీచర్లు వెంకన్న, శంకర్‌చారి, భాస్కర్ తదితరులున్నారు.